


"మరీ అంత దురుసుతనం పనికిరాదు చంద్రమౌళీ! కస్టమర్లమీద ఎగిరి పడొద్దని లక్షసార్లు చెప్పాను. సుబ్రహ్మణ్యం పొగరుబోతని నాకూ తెలుసు. వాడినేమన్నా నేరుగా మొదలియారుతో చెప్తాడు. ఆయన నామీద విరుచుకుపడతాడు! ఏదో సర్దుకుపోవాలి. . . . . ."

"అది కాదండీ! వాడెప్పుడూ అంతే. అవతలంతమంది కాచుక్కూర్చునుంటే తన పని ముందు ముగించలేదని చాలా అసహ్యంగా మాట్లాడాడు. దాంతో నాకు చిరాకేసిగొచ్చి కొంచెం ఆగమన్నాను. అప్పటికీ వినిపించుకోపోయేసరికి కొంచెం గట్టిగా చెప్పాల్సొచ్చింది. శనివారం ఎంత హడావుడిగా ఉంటుందో మీకు తెలుసుగదా!" అన్నాడు చంద్రమౌళి.

సోమవారం బాంకికి రాగానే శనివారం తను ఎవరిమీదో విసుక్కున్నాడని ఏజంటు అనంతరావు ఇలా మందలించడం అతని కేమాత్రం నచ్చలేదు. ఆ సుబ్రహ్మణ్యంతో ఇంతకుముందు జరిగిన ఘర్షణలకే తనకీ ఏజంటుకూ వాద వివాదాలు జరిగాయి. మొదలియారు ఒక పెద్ద కంపెనీకి మేనేజరు. వాళ్ళకి తమ బ్రాంచిలో ఎక్కౌంటు ఉంది. వీలైనంతవరకూ అతనికి కోపం తెప్పించకుండా ఉండటం మంచిదని అనంతరావు అనేవాడు. కాని ఆ శనివారం సుబ్రహ్మణ్యం ప్రవర్తన ఎటువంటివాడికైనా కోపం తెప్పించకమానదు. మళ్ళీ ఈ విషయంలో ఏజంటు తనను తప్పుపట్టడం అతనికి బాధ కలిగించింది.

"శనివారాలు నీకు పని వత్తిడి ఎక్కువగానే ఉంటుందని నాకూ తెలుసునోయ్. కాని కస్టమర్లతో మర్యాదగాఉండే బాధ్యత నీకుందని గ్రహించడం మంచిది" అని అనంతరావు ఇంకా ఏదో చెప్పబోతూన్న చంద్రమౌళిని తన గదిలోంచి పంపించేశాడు. చంద్రమౌళికి చివరకు అనంతరావు చేసిన ఉద్బాటన మరీ చిరాకెత్తించింది. ఆ బ్రాంచిలో తనకంటే శ్రద్ధగా పనిచేసేవారు ఎవరూ లేరని అనంతరావుకీ తెలుసు. అయినా చీటికీ మాటికీ పిలిచి మందలిస్తూ ఉంటాడు చంద్రమౌళి వెళ్ళి తన సీటులో కూర్చున్నాడు.

ఆరోజు కూడా డబ్బు మార్చుకునేందుకు చాలామందే వచ్చారు. 'రిసీట్సు' గుమాస్తా కుప్పుస్వామి సెలవుమీద ఉన్నాడేమో, పేమెంటు క్లర్క్ చంద్రమౌళికి అతని పని కూడా తగిలింది. వచ్చినవాళ్ళ మొహాల వైపొకసారి చూశాడు. పొగాకు బుగ్గనుంచి సన్నగా నవ్వుతూ తన వైపే చూస్తున్న సుబ్రహ్మణ్యం కనిపించాడు. చంద్రమౌళి చిరాకు అధికమైంది. మాట్లాడకుండా ముందు రిసీట్సు తీసుకోడం ప్రారంభించాడు.

(47-వ పేజీ చూడండి)

